మురుగుతో అవస్థలు..!

వినాయకనగర్‌లో మురుగు పారే దారిలేక ఇబ్బందులు

- చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతున్న కాలనీ
- మున్సిపాలిటీ నిర్లక్ష్యంతో ప్రజలకు ఇక్కట్లు
- మురికికూపంలా మారుతున్న పరిసరాలతో దుర్వాసన



కొద్దిపాటి వర్షానికే డ్రెయినేజీలో కలిసిన వర్షపు నీరు

మణుగూరు టౌన్: మణుగూరు మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం.. పట్టణ ప్రజలకు శాపంగా మారుతోంది. పట్టణం నడిబొడ్డున ఉన్న సుందరయ్యనగర్ వినాయకనగర్, శ్రీశ్రీనగర్‌లలో వానాకాలం వచ్చిందంటే చాలు వారి బాధలు అన్నీఇన్నీ కావు. కొద్దిపాటి వర్షానికే నీరుపోయే దారిలేక నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. అంతేకాక కాల్వల్లోని మురుగు నీటితో కలుస్తూ.. దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో స్థానిక ప్రజలు వృద్ధి చెందుతున్న దోమలతో తమ కుటుంబాలు రోగాల బారిన పడుతున్నారని గగ్గోలు పెడుతున్నారు. మున్సిపాలిటీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, కనీసం నిలిచిన మురుగు నీటిని దారి మళ్లించే ప్రయత్నం కూడా చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇది ఇలానే కొనసాగితే ఇంటిల్లిపాది రోగాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శ్రీశ్రీనగర్ వీధిలో నిలిచిన మురుగునీటిని ఎత్తిపోస్తున్న మహిళలు

అలుగు పారితే అవస్థలే..

వినాయకనగర్ మున్సిపాలిటీ శివారు ప్రాంతం కావడంతో అటు వైపు ఉన్న సమితిసింగారం పంచాయతీలోని చెరువు అలుగు పారినప్పుడు ఆ వరద ప్రభావం వినాయకనగర్‌పైనే అధికంగా ఉంటోంది. దీంతో కొద్దిపాటి వర్షానికి ఆ చెరువు నీరు, అప్పటికే వినాయకనగర్‌లో కాల్వల్లో నిలిచిన నీరు పోయే దారిలేక ముంపుకు గురవుతోందని, వర్షం వస్తే మోకాళ్ల లోతు నీళ్లతో బయటకు రాలేని పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైడ్ డ్రెయిన్ల వ్యవస్థ లేక కొద్దిపాటి వర్షానికే రోడ్డు చెరువును తలపించడంతో పాటు నెలల కొద్ది దుర్గంధం వెదజల్లుతుందని, చేసేది లేక తామే బకెట్ల ద్వారా మురుగునీరు ఎత్తిపోస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. సైడ్ కాల్వల్లో పూడుకుపోయిన చెత్త, మట్టిని తీయాలని స్థానిక మున్సిపాలిటీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు దృష్టి సారించి నిలుస్తున్న నీటిని మళ్లించి సైడ్ డ్రెయిన్లు నిర్మించాలని కోరుతున్నారు.

వానొస్తే కష్టాలు..



వానొస్తే ఇళ్లల్లోకి నీళ్లొస్తున్నాయి. ఎప్పుడో నిర్మిస్తానన్నా సైడ్ డ్రెయిన్లు ఇంతవరకూ కాలేదు. కనీసం సైడ్ కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, మట్టిని తీయాలని మున్సిపల్ అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదు. దయచేసి సమితిసింగారానికి చెరువు నుంచి వచ్చే వరదను దారి మళ్లించి వినాయకనగర్‌లో వచ్చే వరద ప్రవాహాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.

– రవి, వినాయకనగర్, స్థానికుడు

ఇబ్బంది పడుతున్నాం..



వానాకాలంలో ముంపు సమస్య తప్పడం లేదు. వానలు తగ్గినా ఆ నీరు పోయే దారి లేక నిలిచిన నీళ్లతో వారాల కొద్ది సహవాసం చేయాల్సి వస్తోంది. ఫలితంగా మురుగు వాసనతో పాటు వృద్ధి చెందిన దోమలతో రోగాల బారిన పడుతూ ఇబ్బంది పడుతున్నాం. చెత్త తీసుకెళ్లడం లేదు. వీధి లైట్లు వేయడం లేదు. సంవత్సర కాలంలో ఒక్క రోజు కూడా బ్లీచింగ్ చేయలేదు.

– మెర్సీ కాంతకుమారి, స్థానికురాలు

క్లుప్తంగా

మురుగు సాగేలా కాల్వ ఏర్పాటు



కాల్వ తవ్వుతున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మణుగూరు రూరల్: మణుగూరు సబ్ డివిజన్ కార్యాలయం సమీపాన రహదారి పక్కనే నిలిచిన నీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయమై 'సాక్షి'లో మంగళవారం 'రోడ్డుపై మురుగు నీరు'శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మునిసిపల్ ఉద్యోగులు మురుగు నీరు సాఫీగా ముందుకు సాగేలా కాల్వ ఏర్పాటుచేశారు. దీంతో స్థానికులు సాక్షితో పాటు మునిసిపాలిటీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

తుమ్మలను కలిసిన నాయకులు

ములకలపల్లి: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు కలిశారు. దమ్మపేట మండలంలోని గండుగులపల్లి స్వగృహంలో మంగళవారం కలిసిన తుమ్మలను కలిసిన పలువురు ఆయనను సన్మానించాక వివిధ అంశాలపై మాట్లాడారు.

తహసీల్దార్‌కు వినతి

దుమ్ముగూడెం: మండలంలోని ప్రగల్లపల్లి గ్రామపంచాయతీ పరిధి శ్రీనగర్ కాలనీలో 1986లో గోదావరి వరదల సమయాన ప్రభుత్వం ఇచ్చిన భూమిని సాగు చేసుకుంటున్న తమకు పట్టాలు ఇప్పించాలని గ్రామ దళితులు కోరారు. ఈసందర్భంగా మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ గ్రామస్తులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి

బూర్గంపాడు: ప్రభుత్వపరంగా విద్యుత్‌శాఖ రాయితీ పొందేందుకు ఎస్సీ, ఎస్టీలకు కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సారపాక విద్యుత్‌శాఖ ఏఈ ఉపేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. సారపాక, బూర్గంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ల కార్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు కుల ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని పేర్కొన్నారు. అలాగే, మీటర్ కలిగిన లబ్ధిదారుడు చనిపోతే డెత్‌సర్టిఫికెట్ సమర్పించి వారసుల పేరిట కనెక్షన్ మార్పించుకోవచ్చని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నర్సింహారావు తెలిపారు. తిప్పనపల్లి, వెంకటాపురం, మహ్మద్‌నగర్ గ్రామాల్లో ఉదయం 9–30 నుండి 12–30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే స్వచ్ఛ సమాజం ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల పరిసరాలల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి



నీటి వనరులను పరిశీలిస్తున్న ఉద్యోగులు

గుండాల: వనంతో పాటు వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుండాల, ఆళ్లపల్లి, రేగళ్ల, కాచనపల్లి రేంజర్లు మురళి, నరసింహారావు, జశ్వంత్, దీపిక అన్నారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో అటవీశాఖ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాల్లో రేంజర్లు మాట్లాడుతూ అడవులు నరికే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే, వన్యప్రాణులు వేటాడొద్దని సూచించారు. అడవులను పెంచితే గిరిజనులకు మేలు జరుగుతుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ బాలాజీ, ఉద్యోగులు సక్కు, కోటేశ్వరావు, చంద్రయ్య పాల్గొన్నారు.

మద్దతు ధరపై చట్టం చేయాలి



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

దమ్మపేట: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర దక్కేలా చట్టం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు ఊకే అప్పారావు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించగా అప్పారావు మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర పలికేలా పార్లమెంటులో చట్టం చేయాలన్నారు. అలాగే, గతంలో కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ భాస్కరరావు, మోరంపూడి శ్రీనివాసరావు, బెజవాడ రాంబాబు, రాధిక, సత్యావతి, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమజాభివృద్ధి..



పాఠశాలలను ప్రారంభిస్తున్న ఏటీడీఓ

ములకలపల్లి: విద్యతోనే సమాజం ప్రగతిపథంలో సాగుతుందని అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ ఆఫీసర్(ఏటీడీఓ) చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని పాతగుండాలపాడు జీపీ పరిధి చలమన్ననగర్, చింతలపాడుల్లో ఏటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాఠశాలలను సర్పంచ్ కారం కుమారి, ఎంపీటీసీ నూపా సరోజినితో కలసి మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐటీడీఏ పీఓ చొరవతో ఇద్దరు రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించి పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కె.వెంకటేశ్వర్లు, జి.సత్యనారాయణ, ఎస్సార్పీ సేరిరాం, సీఆర్పీ బాబూరావు, ఉపాధ్యాయులు కె.ప్రసాద్. ఈశ్వర్‌రావుతో పాటు నూపా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

అశ్వాపురం: మండలంలోని జగ్గారంలో రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సున్నం రాంబాబుతో పాటుట వీరభద్రం, కోడి అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి చేరిన బతుకమ్మ చీరలు

భద్రాచలంటౌన్: ఏటా బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ప్రభుత్వం పంపిణీ చేసే చీరలు మంగళవారం భద్రాచలం చేరుకున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా పంపిణీ చేసేందుకు వాహనంలో తీసుకొచ్చిన చీరలను అధికారులు మండల ప్రత్యేక అధికారి కార్యాలయంలో భద్రపరిచారు. నియోజకవర్గంలోని అర్హులైన మహిళలకు త్వరలోనే పంపిణీ చేయనునట్లు అధికారులు తెలిపారు.

భిక్షాటనతో భోజన కార్మికుల నిరసన

అన్నపురెడ్డిపల్లి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం భిక్షాటనతో నిరసన తెలిపారు. మండలంలోని రాజాపురంలో ఇంటింటికి వెళ్లి భిక్షాటన చేశారు. పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయడమే కాక బీమా, పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, రంగమ్మ, సావిత్రి, తులశమ్మ, సుశీల పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో...

అశ్వారావుపేటరూరల్: మధ్యాహ్న భోజన వంట కార్మికులు మంగళవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు పిట్టల అర్జున్‌తో పాటు వంట కార్మికులు పాల్గొన్నారు.

పరామర్శ

దమ్మపేట: కాంగ్రెస్ నాయకుడు చిన్నశెట్టి యుగేందర్ తల్లి అనసూయమ్మ మంగళవారం మృతి చెందారు. ఈమేరకు ఆయనను కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయనను ఫోన్‌లో పరామర్శించారు. అలాగే, నాయకులు జారే ఆదినారాయణ, రావు జోగేశ్వరరావు తదితరులు అనసూయమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఇంకా దారా యుగంధర్, రావు గంగాధరరావు, కోటగిరి సత్యంబాబు, యర్రగొర్ల రాధాకృష్ణ, రమేష్, అబ్దుల్ జిన్నా, ప్రసాద్, శ్రీరాముల ప్రసాద్, ఉపేంద్ర, గోపిశాస్త్రి, సాయిల నర్సీ, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గూర్ఖా కుటుంబానికి చేయూత




రాజేందర్ కుటుంబానికి సామగ్రి అందజేస్తున్న దృశ్యం

చర్ల రూరల్: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న గూర్ఖా బొహరా రాజేందర్ బహదూర్ కుటుంబానికి మంగళవారం జవ్వాది కుటుంబ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. ఈమేరకు రూ.10వేల నగదుతో పాటు బియ్యం, ఇతర సామగ్రి అందజేసినట్లు జవ్వాది మురళీకృష్ణ తెలిపారు. నీలి ప్రకాశ్, సీ.హెచ్.వీరభద్రం, వెంకట్, తోటమళ్ల రమణమూర్తి, గడ్డం మణికుమార్, కిరణ్‌కుమార్, కిషోర్‌కుమార్, మెహబూబ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

ములకలపల్లి: కేంద్రప్రభుత్వం ప్రకటించిన రైతు వ్యతిరేక చట్టాలను ఉపసహరించుకున్న సందర్భంలో ప్రకటించిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పోతుగంటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ములకలపల్లిలో సంయక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), రైతు సంఘాల ఆధ్వర్యాన కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశాక వారు మాట్లాడారు. నాయకులు ఊకంటి రవికుమార్, నకిరకంటి నాగేశ్వరరావు, కొర్సా రామకృష్ణ, ఛాత్రబోయిన వెంకటేశ్వరరావు, పొడియం వెంకటేశ్వర్లు, వర్సా శ్రీరాములు, గోపగాని లక్ష్మీనర్సు పాల్గొన్నారు.

నియామకం



షేక్ నయీం

అశ్వాపురం: కేసీఆర్ సేవాదళ్ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన షేక్ నయీంను నియమించారు. ఈసందర్భంగా సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అమీర్ హుస్సేన్ మంగళవారం ఆయనకు నియామకపత్రం అందజేయగా నయీం కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఆయన బీఆర్‌ఎస్ ముస్లిం మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

గ్రామసభల్లో గృహలక్ష్మి లబ్ధిదారులను ఎంపిక చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

దుమ్ముగూడెం: గృహలక్ష్మి లబ్ధిదారులను గ్రామసభల నిర్వహణ ద్వారానే ఎంపిక చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మంగళవారం లక్ష్మీనగరం నుండి తహసీల్దార్ వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలో వచ్చి తొమ్మిదిన్నరేళ్లు కావొస్తున్నా అర్హులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఇకనైనా అర్హులకు గృహలక్ష్మి మంజూరు చేసి, దళితులందరికీ దళితబంధు ఇవ్వడమే కాక ఎస్సీలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని, ఆహార భద్రతా కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో పలువురి మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు వివిధ సంఘాల ఆధ్వర్యాన ములకపాడులో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశాక ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమాల్లో నాయకులు కారం పుల్లయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, యలమంచి వంశీ, మర్మం చంద్రయ్య, యాస నరేష్, కొండపల్లి శ్రీధర్, నిమ్మల మధు, రమేష్, వీర్రాజు, అచ్చిరాజు, బొల్లి సత్యనారాయణ, వీరభద్రం, సాంబశివ, కొమరం చంటి, మహేందర్, ప్రసాద్, బొల్లి సత్యనారాయణ, భూక్యా రమేష్, చంద్రయ్య, కొండపల్లి శ్రీధర్, యాసా నరేష్, నిమ్మల మధు, సోయం వీర్రాజు, కొమర చంటి, మహేంద్ర, సోడి సీతమ్మ, కారం కనకమ్మ, సుభద్ర పాల్గొన్నారు.

మా పోడు భూములు మాకే ఇవ్వాలి



డీటీకి వినతిపత్రాన్ని ఇస్తున్న గిరిజనులు

చర్ల: 1986నుంచి పోడు కొట్టి సాగు చేసుకుంటున్న భూములపై పట్టాలను అటవీ శాఖాధికారులు ఇతరులకు ఇచ్చారని, ఇకనైనా తమకే ఆయా భూములను అప్పగించాలని పలువురు గిరిజనులు డిమాండ్ చేశారు. ఈమేరకు న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన మంగళవారం ర్యాలీ నిర్వహించి తహసీల్ ఎదుట ధర్నా చేశాక డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ నాయకుడు ముసలి సతీష్ మాట్లాడుతూ లింగాలకు చెందిన గిరిజనులు పోడు కొట్టుకుని సాగు చేసుకుంటున్న భూములను కొందరు నాయకులు అటవీ అధికారులతో కలిసి ఇతరుల పేరిట పట్టాలు చేయించారని ఆరోపించారు. ఇకనైనా ఆయా పట్టాలను రద్దు చేసి అర్హులైన లింగాల గిరిజనులకు ఇప్పించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిగిడి నరేష్, బొర్రా సమ్మక్క, సప్కా నాగలక్ష్మి, అలవాల రమణ, భద్రమ్మ, భాయమ్మ, లక్ష్మీ, శ్రీలత, సతీష్, శ్రీను పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రోజులు దగ్గర పడ్డాయి..

మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



హామీల కరపత్రాలు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్: గత ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ హామీని కూడా నెరవేర్చని బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోనే కాక పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పట్టం కట్టడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన సమితిసింగారం పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలుచేయనున్న పథకాల కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. నాయకులు, ప్రజాప్రతినిధులు కే.వీ.రావు, పీరినాకి నవీన్, పుచ్చకాయల శంకర్, గోరంట్ల కనకయ్య, వెంకట్రావ్ గౌడ్, బాజి, తాటి భిక్షం, నాయకులు సుబ్బారెడ్డి, పాతూరి వెంకన్న, పల్లవు తిరుమలేశ్, చింతల కృష్ణ, బల్లెం సురేశ్, మాదాడి రాజేశ్, పాల్వంచ రాములు, మానస, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఏజెన్సీ వాసులు 'గృహలక్ష్మి'కి అర్హులు కారా?

- సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల నిలదీత



ఎంపీడీఓను నిలదీస్తున్న కోఆప్షన్ సభ్యుడు పాషా

అశ్వారావుపేటరూరల్: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న దళిత, బీసీ, మైనారిటీ, రైతుబంధుతోపాటు ఇతర పథకాలకు లేని ఏజెన్సీ నిబంధనలు ఒక్క గృహలక్ష్మి పథకానికి ఎందుకు చెబుతున్నారని పలువురు ప్రజాప్రతినిధులు నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు సమర్పించారు. కాగా, గృహలక్ష్మి పథకం నిబంధనలపై కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.పాషా, ఎంపీటీసీ వేముల భారతి అడగగా... ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. దీంతో ప్రజాప్రతినిధులు అభ్యంతరం చెబుతూ నిలదీశారు. ఇంకా పలు అంశాలపై ప్రశ్నించిన ఎంపీటీసీ కాసాని దుర్గ, కోఆప్షన్ సభ్యుడు పాషాకు ఎంపీఓ సీతారామరాజు, ఎఫ్‌ఎస్‌ఓ అరుణ్ సమాధానాలు చెప్పారు. కాగా, మొత్తం 30 మంది సర్పంచ్‌ల్లో నలుగురితో పాటు ఎనిమిది ఎంపీటీసీలు హాజరయ్యారు. అయితే, ఎంపీటీసీల కోరం లేకపోవడంతో గంట ఆలస్యంగా సమావేశాన్ని ప్రారంభించారు.

మండలంలో మెచ్చా పర్యటన



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

దమ్మపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా తొట్టిపంపు, గున్నేపల్లి, మొద్దులగూడెం, వడ్లగూడెం, అల్లిపల్లి, రంగువారిగూడెం, మారప్పగూడెం, మల్కారం, రాచూరుపల్లి, పెద్దగొల్లగూడెం, దమ్మపేట, మందలపల్లి, ముష్టిబండ తదితర గ్రామాల్లో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. మొద్దులగూడెంలో పల్లె దవాఖానా, సీసీ రోడ్లను ప్రారంభించారు. రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్‌తో పాటు దారా యుగంధర్, దారా మల్లికార్జునరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, దొడ్డా రమేష్, ప్రసాద్, భరత్, అబ్దుల్ జిన్నా పాల్గొన్నారు.

యూపీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

బూర్గంపాడు: రైతుల మరణానికి కారణమైన ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసే వరకు ఐక్య పోరాటాలు కొనసాగించనున్నట్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వైఎస్.రెడ్డి తెలిపారు. మండలంలోని సారపాకలో మంగళవారం జరిగిన అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐఎంఎస్‌కే) సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రతిపాదించిన సాగు చట్టాలకు వ్యతిరేకంగా 2021లో ఉత్తర ప్రదేశ్‌లో రైతులపై కేంద్రమంత్రి అజయ్‌మిశ్రా కుమారుడు ఆశిష్ కారు ఎక్కించి నలుగురి మృతికి కారకుడయ్యాడని ఆరోపించారు. ఈమేరకు ఆయనపై చర్యలు తీసుకోవడమే కాక ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బర్ల రామకృష్ణ, వీరస్వామి, దుర్గాప్రసాద్, రాము, నాగయ్య పాల్గొన్నారు.

మధ్యంతర భృతి 20 శాతంగా ప్రకటించాలి

భద్రాచలంటౌన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐదు శాతం కాకుండా 20 శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని టీపీటీఎఫ్ నాయకుడు మునిగడప రామాచారి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మంగళవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారని తెలిపారు. ఐఆర్ ఉత్తర్వులు సవరించడమే కాక పెండింగ్‌లో ఉన్న డీఏలు మంజూరు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఐఆర్ వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఐదు శాతం ఐఆర్ సరికాదు..

గుండాల: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐదు శాతం ఐఆర్ ప్రకటించడంపై యూఎస్‌పీసీ నాయకులు జోగ రాంబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈమేరకు ఆళ్లపల్లి మండల కేంద్రంలో మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలను సంప్రదించకుండా ఏకపక్షంగా ఐఆర్ ప్రకటించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్లావత్ హతీరాం, నరేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, బాబూలాల్, శాంతారావు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలి

భద్రాచలంటౌన్: ఐటీడీఏల పరిధిలో స్పెషల్ డీఎస్సీ నిర్వహించి ఆదిమ తెగల నిరుద్యోగులతో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, మానవహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తవరపు జానకీరాములు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిదిన్నరేళ్లు దాటినా ఏజెన్సీలో ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదని ఆరోపించారు. కాగా, భద్రాచలంలో బీఈడీ కళాశాల తరహాలో న్యాయ కళాశాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించండి



భద్రాచలంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

భద్రాచలంఅర్బన్: ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు అండగా నిలుస్తున్న ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు రూ.18 వేల వేతనం చెల్లించాలనే డిమాండ్‌తో మంగళవారం భద్రాచలంలో ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మాచారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేస్తున్న ఆశా కార్యకర్తలను ఆదుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్లపాటి రేణుక, ఎంబీ.నర్సారెడ్డి, పాయం చంద్రకళ, శిరోమణి, నర్సమ్మ, బాగ్యం, వెంకటనర్సమ్మ, వరలక్ష్మి, సుశీల, హైమ తదితరులు పాల్గొన్నారు.